ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-12-96)

## శ్రీ రమణ జయంతి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు భగవాన్ శ్రీరమణ మహర్షి 117వ జయంతి. వారి బోధలు స్మరించుకొని వారి అనుగ్రహానికి పాత్రులు అవ్వడం కోసం మనం ఈ జయంతులు జరుపుకొంటున్నాము. ఉప్పు లేని పప్పు ఎలాగ ఉంటుందో జ్ఞానులు, అవతారపురుషుల యొక్క బోధలు లేని లోకం కూడా అలాగ ఉంటుంది. జ్ఞాని ప్రత్యేకంగా బోధించనక్కరలేదు, శరీరం ధరించి ఉంటే సరిపోతుంది. పురస్కారమురము, తిరస్కారము దేహానికి పరిమితమైన బుద్ధికి మాత్రమే. మనకు దేహబుద్ధి ఉంటే పురస్కారం చేసినపుడు అది పొంగుతుంది, తిరస్కారం చేసినపుడు అది కృంగుతుంది. సత్కారములు, తిరస్కారములు మిధ్యా నేనుకు మాత్రమే. అహంకారమును అలంకరించుకోవడానికి కాకుండా ఈ సృష్టికి ప్రభువు ఎవరో ఆయనను సంతృప్తి పరచడం కోసం పని చేస్తే అనుగ్రహము అనే దుప్పటితో కప్పి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. పెద్ద పెద్ద పనులు మనం చేయలేము. చిన్న చిన్న పనులు అయినా భగవంతునికి సంతోషం కలగడం కోసం చేస్తే మనకు శాంతిని ప్రసాదిస్తాడు. ఆత్మజ్ఞానం పొందడం మీరు అనుకొన్నంత కష్టం కాదు. అన్నింటి కంటే అత్యంత సులభం ఆత్మ జ్ఞానం అన్నారు భగవాన్. అన్నింటి కంటే సులభం ఆత్మ జ్ఞానం ఎలా అవుతుంది అని ఒక భక్తుడు అడిగితే నువ్వు ఎందుకు సందేహిస్తున్నావు . నువ్వు సందేహిస్తే నేను ఏమి చెపుతాను. అది సులభమే అన్నారు. ఒక వ్యక్తి ప్రగతి సాధించాలంటే, తన చైతన్య స్థాయిని పెంచుకోవాలి అని అనుకొంటే, తను బాగుపడుతూ సమాజం కోసం పని చేయాలంటే ఒక చిన్న ఉపాయం ఉంది. అది ఏమిటంటే పని, త్యాగము ఇవి రెండూ మిశ్రమం అయి పని చేయాలి. పనిచేసి దాని వలన వచ్చే ఫలితాన్ని సమాజమునకు అర్పిస్తే మనం బాగుపడతాము, సమాజం బాగుపడుతుంది. పని, త్యాగము మిశ్రమము వలననే కుటుంబం, దేశం బాగుపడతాయి. సమాజం యొక్క స్థాయి పెరుగుతుంది. సోమరితనం వలన నీకు, నీకుటుంబానికి, దేశానికి నష్టమే. జ్ఞానానికి, పనికి విరోధం లేదు. సోమరితనంగా ఉండమని జ్ఞానం చెప్పటం లేదు. పని చేయమనే జ్ఞానం చెపుతోంది.

రమణుడు మహాగురువు, మహాజ్ఞాని, అవతారపురుషుడు. అయినప్పటికీ నేను మీఅందరిలాంటి వాడినే, నేను పైనుండి క్రిందకురాలేదు, క్రింద నుండి పైకివచ్చాను అన్నారు. మేము పడ్డ కష్టం మీరు పడకుండా మీకు జ్ఞానం వచ్చింది కదా అని అంటే మీరు ఏది అయితే కష్టం అనుకుంటున్నారో అది నేను పూర్వజన్మలో పడి ఉండవచ్చును కదా అన్నారు. ఈ ప్రపంచంలో రెండు విషయాలు కష్టమని ఒక చైనాతత్వవేత్త చెప్పాడు. ఈ రెండు విషయములు అర్థం చేసుకుంటే మీరు ఈ భూమి మీద ఉండగానే దేవుడు అంతటివారు అవుతారు. ఈ విషయాలు ఇప్పుడు ఎందుకు ప్రస్తావిస్తున్నాను అంటే ఇవి రెండూ నూటికి నూరు వంతులు రమణ మహర్షిగార్కి వర్తిస్తాయి. ఈ రెండు విషయాలు ఏమిటి అంటే (1) మాటలతో సంబంధంలేకుండా బోధించడం, (2) కర్తృత్వం లేకుండా పని చెయ్యటం. మాటమాట్లాడకూడదు బోధ జరుగుతూ ఉండాలి. పనిచెయ్యాలి కర్తృత్వబుద్ధి లేకుండా పనిచెయ్యటం, అహంభావన లేకుండా పని చెయ్యాలి. అలా చేస్తే

మీరుకూడా జ్ఞాన సింహాసనం మీద కూర్చోవచ్చును. ఇవి రెండూ కష్టం అని చైనాతత్వవేత్త చెప్పాడు. ఇవి రెండూ సాధించినవాడు రమణమహర్షి. మాటలు లేకుండా బోధించాడు. కర్తృత్వం లేకుండా పనిచేసాడు. ఆయన పని చేయలేదు అని అనుకోవద్దు. ఆ చైనాతత్వవేత్త చెప్పినట్లుగా ఈ సృష్టిలో ఎవడైనా చేసాడా అంటే అది రమణాచార్యులకు వర్తిస్తుంది.

మానవుడికి దుఃఖం కర్తృత్వబుద్ధిలో నుండి వస్తోంది. కులం, గోత్రం, నామం, రూపం ఇవిఅన్నీ దేహబుద్ధి మీద ఆధారపడి ఉన్నాయి. దేహబుద్ధి నశించిన క్షణంలో నామంలేదు, రూపంలేదు, కులంలేదు, గోత్రంలేదు, ఏదీలేదు. దేహబుద్ధి నశించినపుడు ఇవి అన్నీ కూడా నశిస్తాయి. మీరు పనులు చేస్తున్నారు. మెకానికల్‌గా చేస్తున్నారు. మీరు హృదయపూర్వకంగా, డివోటెడ్‌గా పని చేయటంలేదు. మనం జీవించే జీవితం కృత్రిమం. కృత్రిమ జీవితం వలన నిజం తెలియదు. మనలను సక్రమమైన మార్గములో నడిపించమని భగవంతుడు అనేకమంది గురువులను, అవతారపురుషులను ఈ భూమి మీదకు పంపిస్తున్నాడు. మనం దేహానికి పరిమితమై ఉన్నంతకాలం చైతన్యం మనకు తెలియదు. చైతన్యం సృష్టి అంతా వ్యాపించి ఉంది. సృష్టికి అతీతంగా ఉంది. అది నీ హృదయంలో కూడా ఉంది. సృష్టి ఉన్నప్పుడు చైతన్యం ఉంది, సృష్టి లయమయిపోయినపుడు కూడా అది ఉంటుంది. అది నీవే. నీ దేహానికి మరణం ఉందిగాని చైతన్యానికి మరణం లేదు. చైతన్యం జనన, మరణములకు అతీతమైనది. ఆ చైతన్యం నుండే నేను అనే తలంపు ఉదయించింది. మనం నేను, నేను అంటున్నాము ఆ నేను నిజంకాదు. నిజం ఎప్పుడూ సమానంగా ఉంటుంది. ఈ నేను నిజంకాదు కాబట్టి దీనికి హెచ్చుతగ్గులు ఉంటాయి. ఈ నేను యొక్క మూలంలోనే చైతన్యం ఉంది. ఈ నేను అనే తలంపును పట్టుకొని దాని మూలం లోనికి వెళితే చైతన్య ప్రవంతిలో ఐక్యం అవుతాము. అచైతన్య ప్రవంతిలో ఐక్యం కావాలంటే బాహ్యమైన గురువును, జ్ఞానులను హృదయపూర్వకంగా ప్రేమించాలి.

గురువులకు సత్కారం చేస్తున్నారు అనుకోండి వారికి కొంచెం కూడా సంతోషం రాదు. మన సంతోషం కోసం చేస్తున్నాము. అక్కడ దేహబుద్ధి ఉంటే సంతోషం వస్తుంది గాని దేహబుద్ధి లేనివాడికి సంతోషం ఏమిటి. దేహబుద్ధి లేనివాడికి సన్మానం అయినా, అవమానం అయినా ఒకటే. దేహబుద్ధి లేనివాడిని ప్రేమించగా ప్రేమించగా దేహబుద్ధి లేని స్థితికి తీసుకొని వెళతాడు. దేవుడిని పూజించటం వలన, గౌరవించటం వలన దేవునికి వచ్చే లాభం ఏమీలేదు. దేవుడిని పూజించటం వలన దేవుడు ఏ చైతన్యం అయిఉన్నాడో ఆ చైతన్యాన్ని మనకి స్వరూపంగా వ్యక్తం చేస్తాడు. బాహ్యగురువును ప్రేమించగా ప్రేమించగా లోపల ఉన్ననిజమైన గురువు దగ్గరకు మనలను తోలుకొని పోతాడు. బాహ్యగురువును మనం నిజం అనుకున్నా ఆ దేహం నిజంకాదు అని వాడికి తెలుసు. నిజం మనకు తెలియక పోయినా ఏది నిజమో మనం పూజించే గురువుకు తెలుసు. మన హృదయంలో ఉన్న నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళేవరకూ నిన్ను వదిలిపెట్టడు. సద్వస్తువును సాక్షాత్కరించుకొన్నవాడు ఎప్పుడూ జ్ఞాననిష్టలోనే ఉంటాడు. వాడు జ్ఞానగురువు. వాడికి శరీరంతో పనిలేదు మనకోసం శరీరం ధరించి వస్తాడు.

(B) దేహానికి మరణం ఉంది. చైతన్యానికి మరణం లేదు. అచైతన్యము నేనై ఉన్నాను. ఏ చైతన్యమును దేవుడు, దేవుడు అంటున్నామో ఆ చైతన్యం తన 16వ ఏట ఆయనకు నేనుగా వ్యక్తమయింది. చైతన్యానికి మరణం లేదు మరణించేది దేహమే అన్న సంగతి చదువు లేకుండా, శ్రవణం లేకుండా, గురువు దగ్గర నేర్చుకోకుండా, దేవాలయముల చుట్టూ తిరగకుండా మానవజాతి అంతా ఏ గమ్యాన్ని చేరుకోవడానికి ప్రయాణం చేస్తోందో ఆ చైతన్యస్థాయిని తన 16వ సంవత్సరంలోనే పొందినవాడు రమణమహర్షి. వేదకాలం నుండి ఈ కాలం వరకు చూస్తే ఈ రకంగా జ్ఞానం పొందినవాడు ఏ యుగంలోనూలేదు. త్రేతాయుగం, ద్వాపరయుగం,

కలియుగం అని ఇలా యుగాల పేర్లు చెప్పారు ఇవి అన్నీ అజ్ఞానికి. జ్ఞానికి ఒకటే యుగం అది సత్యయుగం. ఆయన మధురలో ఉండగా టీనేజ్‌లోనే ఆయనకు బ్రహ్మానుభవం కలిగింది. ఆయన టీచింగ్ అంతా ఆయన అనుభవంలో నుండి తీసిచెప్పినది. ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో మనం కూడా ఆ స్థాయికి చేరుకోవటానికి సహకారం అందించటమే ఆయన టీచింగ్ యొక్క లక్ష్యం. ఒక మహాగురువు, జ్ఞాని మనలను ఉద్ధరించాలి అనుకొన్నప్పుడు ఉద్ధరింపబడకుండా ఎవడూ ఆపుచేయలేడు. నీలో దుర్గుణాలుగానీ, బాహ్యమైన శత్రువులుగానీ, ప్రకృతిగాని ఎవరూ ఆపుచేయలేరు. చైతన్యం యొక్క అనుగ్రహం నేను పొందినపుడు భౌతికమైన శక్తులు ఆ చైతన్యశక్తి ముందు ఆగవు. నీ బుద్ధిని నడిపించేవాడు లోపల ఒకడు ఉన్నాడు. నీవు ఏ రకంగా తనలో కలుస్తావో అలాగ నిన్ను డైరెక్ట్ చేస్తున్నపుడు భౌతికమైన శక్తులు నీకు అడ్డురావు. ఒకవేళ అడ్డుకున్నా అవి ఆగవు. నాకు జ్ఞానం కావాలి అంటే జ్ఞానం వచ్చివేయదు. ఎవడినైతే ఈశ్వరుడు అనుగ్రహించాలి అనుకొన్నాడో వాడికి మాత్రమే ఆయన తెలియబడతాడు. ఈశ్వరానుగ్రహం లేకుండా ఆయన మనకు తెలియబడడు.

పాపము, పుణ్యాము, శత్రువులు, మిత్రులు, ద్వైతబుద్ధి ఇవి అన్నీ ఉపాధికి సంబంధించిన విషయాలు, ఉపాధి ఎంత నిజమో ఇవి కూడా అంతే నిజం. చైతన్యానికి వీటితో సంబంధం లేదు. నీకు తెలిసున్నా, తెలియకపోయినా నువ్వు చైతన్య స్వరూపుడవే. చైతన్యం ఎలాగ ఉంది? సుఖంగా ఉంది, శాంతంగా ఉంది. దేవుడు అంటే ఉండటం. దాని అంశ మనలో కూడా ఉంది. అందుకని మనకు ఎప్పుడూ ఉండాలని ఉంది. ఏ మనిషికీ చనిపోవాలని ఉండదు. ఎందుచేతనంటే ఎప్పుడూ ఉండే వస్తువు మనలో ఉంది. అది చావులేకుండా ఉంది. ఆ చావులేని వస్తువును నీవు తెలుసుకొనేవరకూ చావుకు గురిఅవుతూ ఉండవలసిందే. నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువు నీకు నేనుగా వ్యక్తమయ్యేవరకూ జనన మరణములకు గురికావలసిందే. ఈ చావులేని వస్తువుకు దేహానికి ఇసుమంతయు కూడా సంబంధం లేదు అని మరణానుభవం ద్వారా తెలుసుకొని లోకానికి గురువు అయ్యాడు. ఆయనే రమణమహర్షి. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అని చెప్పారు. నీవు ఎవరు? చైతన్యానివి. నీవు చైతన్యం అని గ్రహించినపుడు లోకం అంతాకూడా చైతన్యంగా కనబడుతుంది.

నీ బుద్ధిని కంట్రోలు చేసేవాడు ఒకడు నీలోపల ఉన్నాడు. వాడు నిన్ను పట్టుకోవాలిగాని నువ్వు వాడిని పట్టుకోలేవు. వాడిలో నీబుద్ధి లయమయితే వాడు నీకు వ్యక్తమవుతాడు. ఎవడైతే నీ బుద్ధిని కంట్రోల్ చేస్తున్నాడో వాడిని నీ తెలివితో పట్టుకోలేవు. వాడికి శరణాగతి చెందడం వలన వాడు నీకు తెలియబడతాడు. దేహం మరణించిన తరువాత కైలాసానికి వెళ్ళినా, వైకుంఠానికి వెళ్ళినా తిరిగి వచ్చేస్తారు. దేహం మరణించిన తరువాత ఎవరికి ఏ దేవత అంటే ఇష్టమో ఆ దేవతకు సంబంధించిన లోకానికి వెళతారు. మరల ఈ భూమి మీదకు వచ్చేస్తారు. ఈ లోకాలకు వెళ్ళటం, రావటం చివరస్థితి కాదు. ఇక్కడ రమణమహర్షిగారు నగ్నసత్యం చెప్పారు. దేహం లోపల నేను ఉన్నాను అనుకొంటున్నాను. దేహం బయట ప్రపంచం ఉంది అనుకొంటున్నాను. ఎక్కడో దేవుడు ఉన్నాడు అనుకొంటున్నాను. ఈ మూడు ఉన్నంతకాలం రాకపోకలు తప్పవు. పరమస్థితి ఏది అంటే ఎక్కడో ఉన్నాడు అనుకొనే దేవుడు, నీ కళ్ళకు కనబడే ప్రపంచం నీవు అనుకొనే నేను ఒకటిగా దర్శనం ఇవ్వాలి. అది ఆడసారి జన్మ. అహంకారము అనే అడవిలోనుండి బయటకు రావాలంటే నీతెలివి, నీప్రయత్నం, నీధ్యానం ఒక్కటే సరిపోదు. ఈశ్వరానుగ్రహం లేకుండా అహంకారం నుండి బయటకు రాలేవు. ధ్యానం చేస్తున్నాము ఆరోగ్యం బాగానే ఉంటోంది అని కొంతమంది చెపుతున్నారు. ధ్యానమును కేవలం దేహానికి పరిమితం చేస్తున్నారు . ధ్యానం యొక్క ప్రయోజనం ఏమిటో కలియుగం మర్చిపోతోంది. నీ మనస్సును స్వాధీనం చేసుకొని భగవదనుభవం పొందటానికి నీవు చేసే ధ్యానం, విచారణ సహకరించాలి. ధ్యానం యొక్క ప్రయోజనమును దేహమునకు, మనస్సుకు పరిమితం చేసుకోకూడదు. మీరు పొందవలసిన

వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవడమే ధ్యానం యొక్క గమ్యం.

బంధము, మోక్షము నిజం కాదు. ఇవి బుద్ధి యొక్క కల్పితాలు. నీవు ఎంతకాలం అయితే కల్పితంలో ఉన్నావో అంతకాలం నీకు నిజం తెలియదు. నీకు నిజం కావాలంటే నీవు కల్పితంలోనుండి బయటకు రావాలి. మనస్సుతో తాదాప్యం పొందుతున్నంతకాలం, బుద్ధికి పరిమితమై ఉన్నంతకాలం బంధం, మోక్షం నిజం అనిపిస్తుంది. నిజమైన నేనుకు , సత్యానికి బంధం లేదు, మోక్షం లేదు. బంధం లేని, మోక్షం లేని ఆ పరసుఖానికి తీసుకొని వెళ్ళటానికే భగవంతుని బోధ అంతా గురిపెడుతున్నాడు. ఆ సుఖము ఎటువంటిది అంటే ఒక కొండ దగ్గరకువెళ్ళి దానిని కదిపితే అది కదులుతుందా కదలదు. అలాగే నీవు పరసుఖంలో ఉన్నప్పుడు ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా నీకు వచ్చినా ఆ సుఖ స్వరూపం నుండి నిన్ను గెంటలేదు. నిన్ను దుఃఖం, జననము, మరణము ఇవి ఏమీ ముట్టుకోలేవు. కాలమును, శక్తిని పాడుచేసుకోవద్దు. జన్మాంతర వాసనను బట్టి దేహగతమైననేనును నువ్వే అనుకొంటున్నావు. సాధన తరువాత చేయవచ్చు. ముందు దీనిని సందేహించు. దానిని సందేహిస్తే దాని పునాది కదులుతుంది. అప్పుడు అది నీకు దారి ఇస్తుంది.

హేతువాదానికి కొన్ని సంఘటనలు అతీతంగా ఉంటాయి. భగవంతుడిని హేతువాదంతో పట్టుకోలేము. హేతువాదం అనేది నీబుద్ధికి పరిమితం. అయితే రీజన్ విడిచిపెట్టమని రమణమహర్షిగారు చెప్పడం లేదు. రీజన్ ఎంతవరకు మీకు సహకరిస్తుందో అంతవరకూ రీజన్ కూడా వెళ్ళమంటున్నారు. రీజన్ ఇంక ఆ బోర్డరుదాటి వెళ్ళదు అనుకొన్నప్పుడు, ఇంక ప్రయాణం చేయలేనప్పుడు విశ్వాసం మీద ఆధారపడమంటున్నారు. విశ్వాసం కూడా కొండలను కదుపుతుంది. నీకు లోపలఉన్న వస్తువు డైరక్ట్‌గా అనుభవంలోనికి వచ్చినపుడు నమ్మకాలతోను, విశ్వాసంతోను పని ఏముంది? భక్తి మార్గానికి నమ్మకాలు, విశ్వాసం అవసరం. జ్ఞానమార్గానికి నమ్మకాలతో, విశ్వాసంతో పనిలేదు. అది జ్ఞానమార్గం యొక్క వైభవం. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది, సాత్వికగుణం ఉన్నవారు దానిని స్వతంత్రించుకొందురు అన్నాడు ఏసు. మనకు అప్పుడప్పుడు సత్వగుణం వస్తుంది కాని దాని వెనకాల తమోగుణం, రజోగుణం వచ్చి అందులో కలిసిపోతాయి. ఏ గుణం ఏమిటో మనకు తెలియదు. మనం బలవంతం చేసినా సత్వగుణం రాదు. సత్వగుణం వచ్చినపుడు అది ఎక్కువ కాలం ఉండేటట్లు చూసుకోండి. సత్వగుణం గమ్యం కాదు కాని జ్ఞానాన్ని మనకు పట్టిఇస్తుంది. సత్వగుణం సహాయం లేకపోతే ఈజన్మలోనేకాదు, రాబోయే జన్మలో కూడా మనం జ్ఞానాన్ని సంపాదించలేము.

నేను ఎవడినో నేను తెలుసుకోవాలి అనే బుద్ధి అందరికీ కలుగదు. ఎవరికి కలుగుతుంది అంటే వివేకవంతులకు, సహృదయం ఉన్నవారికి, సత్కర్మ చేసినవారికి, చైతన్యస్థాయిలో కొంతదూరం వెళ్ళినవారికి మాత్రమే వారు ఎవరో వారు తెలుసుకోవాలి అనే బుద్ధి కలుగుతుంది గాని అందరికీ కలుగదు. నేను వచ్చాక అన్నీ వస్తున్నాయి. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో దానిని అంటే నేను అనే మొదటి తలంపు గురించి తెలుసుకోవడం మానివేస్తున్నావు. అదే మాయ. దేవుడు ఏ చైతన్య స్థాయిలో ఉన్నాడో, దేవుడు ఏ సుఖాన్ని, శాంతిని అనుభవిస్తున్నాడో ఆ స్థాయికి జీవులను తీసుకొని పోవడం లక్ష్యంగాని నీ కళ్ళకు దేవుని చూపించటం కాదు. దేవుడు అనుభవించే సుఖం, శాంతి మీరు కూడా అనుభవించాలి. ఆ స్థితికి మిమ్మలను మేల్కొలపటానికి వచ్చిన మహాగురువు, మహాజ్ఞాని శ్రీ రమణమహర్షి. సనత్‌కుమారుడుగా ఉండగా నారదుడికి బోధ చేసేటప్పుడు కూడా 'నేను' గురించి కొద్దిగా చెప్పాడు. రమణమహర్షిగా ఉండగా ఈ అవతారంలో నేను గురించి చాలా వివరంగా చెప్పాడు. జ్ఞానులు మనతో తర్కించటానికి ఈ భూమి మీదకు రారు. మనకు ఉపదేశించి, మనలను ఉద్ధరించటానికి ఈ భూమి మీదకు వస్తారు.